క్లుప్తంగా

నేటి నుంచి బతుకమ్మ చీరల పంపిణీ

ఇల్లెందురూరల్: బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని మండలానికి ప్రభుత్వం 18,156 చీరలు కేటాయించింది. ఆయా చీరలు ఆదివారం మండల కేంద్రానికి చేరాయి. గ్రామాల్లో కార్యదర్శి, స్వయం సహాయక సంఘం అధ్యక్షురాలు, సెర్ప్ సీసీ, రేషన్ డీలర్ సమష్టిగా బతుకమ్మ చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. సోమవారం పంపిణీ ప్రారంభమవుతుందని సెర్ప్ ఏపీఎం దుర్గారావు ఆదివారం మీడియాకు తెలిపారు.

మిషన్ భగీరథ కార్మికుల జిల్లా అధ్యక్షుడిగా సుమన్

పాల్వంచ: మిషన్ భగీరథ కార్మికుల సంఘం (ఐఎన్‌టీయూసీ) జిల్లా అధ్యక్షుడిగా పెనతల సుమన్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం కేటీపీఎస్ 327 కార్యాలయంలో జరిగిన సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఏ.జలీల్ నియామక ఉత్తర్వులు అందజేశారు.

పశువులను వదిలిపెట్టొద్దు..

జూలూరుపాడు: రైతులు, పశుపోషకులు తమ పశువులను నిర్లక్ష్యంగా వదిలిపెట్టొద్దని జూలూరుపాడు ఎస్ఐ బి.రాణాప్రతాప్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ... పశువులు రాత్రిపూట రోడ్లపైకి రావడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఒక్కోసారి వేగంగా వెళ్లే వాహనాలు ఢీకొట్టడం వల్ల మృత్యువాత పడుతున్నాయని చెప్పారు. ఒకవైపు పశువుల ప్రాణాలు పోవడంతోపాటు, మరోవైపు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు చెప్పారు. తల్లాడ – కొత్తగూడెం ప్రధాన రహదారి వెంట ఉన్న గ్రామాల రైతులు, పశుపోషకులు తమ పశువులను వదలరాదని కోరారు.

మఫ్టీలో ట్రాఫిక్ పోలీసులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీతో పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు కొందరు ఆకతాయిలు ద్విచక్ర వాహనాలపై చేస్తున్న వికృత చేష్టలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ ఎస్సై నరేష్ నేతృత్వంలో సిబ్బంది మఫ్టీలో ట్రాఫిక్ రద్దీ ఉన్న చోట్ల రెక్కీ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కొందరు ఆకతాయిల బుల్లెట్ వాహనాలు సీజ్ చేశారు. వారంరోజులుగా పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీలతో ఆకతాయిలు, నంబర్ ప్లేట్ లేనివారు, త్రిబుల్ రైడ్ చేసేవారు జాగ్రత్త పడుతున్నారు.


రెండు కిలోమీటర్లు.. ఐదురోజులు



జాతీయ రహదారిపై కంటైనర్ వాహనం

పాల్వంచరూరల్: రెండు కిలోమీటర్లు దూరం వెళ్లడానికి భారీ కంటైనర్ వాహనానికి ఐదు రోజులు పట్టింది. పాల్వంచ మండలం కేశవాపురం గ్రామం వద్ద ఈనెల 2వ తేదీన బీసీఎం జాతీయ ప్రధాన రహదారిపై భారీవాహనం మరమ్మతులకు గురికావడంతో నిలిచిపోయింది. తెల్లారి మరమ్మతులు నిర్వహించారు. అక్కడ నుంచి బయలుదేరిన వాహనం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాల్వంచకు ఆదివారం చేరుకుంది. దీంతో రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. 94 టైర్లు కలిగిన భారీ కంటైనర్‌పై మణుగూరు బీటీపీఎస్ నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను చెన్నైకి తీసుకెళ్తోంది.

జమ్మి చెట్టు లేకుండానే 'దసరా'



- హరితహారం, వనమహోత్సవంలో జమ్మి మొక్కలకు లభించని స్థానం
- ఇల్లెందులో ఈ నెల 12న జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో దసరా ఉత్సవాలు



జమ్మి కొమ్మకు పూజలు చేస్తున్న దృశ్యం(ఫైల్)



శమీపూజలు అందుకునేందుకు తరలివచ్చిన రథాలు (ఫైల్)

ఇల్లెందు: ఇల్లెందులో ఈ నెల 12న జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో దసరా ఉత్సవాలు జరగనున్నాయి. నవరాత్రుల చివరి రోజున విజయదశమి నాడు శమీ (జమ్మి) పూజ చేయటం తెలుగువారి రివాజు. పాండవులు అరణ్యవాసం ముగించుకుని అజ్ఞాతవాసం వెళ్లే కాలంలో తమ ఆయుధాలు, వస్త్రాలను శమీ (జమ్మి) వృక్షం మీద దాచారని పురాణాలు చెబుతున్నాయి. అజ్ఞాత వాసం ముగిసిన తర్వాత శమీ వృక్షాన్ని పూజించి వస్త్రాలు, ఆయుధాలు ధరించారని ప్రతీతి. శమీ వృక్షంపై అపరాజితా దేవీ కొలువై ఉందని ఆ దేవీ మహిమతోనే పాండవులు కురుక్షేత్ర యుద్ధంలో గెలిచారంటారు. శ్రీరాముడు విజయదశమి రోజున అపరాజితా దేవిని పూజించి రావణుడిపై విజయం సాధించాడని రామాయణంలో ఉంది. తెలంగాణలో ప్రతీ పోలీస్ స్టేషన్‌లో విజయదశమి రోజున ఆయుధ పూజ జరుగుతుంది. పోలీసులే కాదు ప్రతీ పారిశ్రామిక వాడల్లో ఆయుధ పూజలు చేస్తారు. ఇక ఇదే దసరా రోజున సాయంత్రం పాలపిట్టను దర్శించుకుంటారు. విజయదశమి రోజున నక్షత్ర దర్శనం తర్వాత శమీ పూజ, పాలపిట్ట దర్శనం, అపరాజితదేవీ పూజలు జరపటం ఈ పర్వదినం ఆనవాయితీ.

జమ్మి చెట్లు కరువు...

ఇల్లెందులో ఏటా దసరా ఉత్సవాలు మైసూర్‌ను తలపించే రీతిలో ఉంటాయి. అయితే ఇప్పుడు ఉత్సవాలు సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యూజికల్ నైట్ ప్రోగ్రాంలకే పరిమితం అవుతున్నాయి. కానీ ఈ ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన మూల కారణం విస్మరిస్తున్నారనే అపవాదు భక్తుల్లో తలెత్తుతోంది. ముఖ్యంగా శమీపూజ, పాలపిట్ట దర్శనం, అపరాజితా దేవీ పూజలు నిర్వహించాలి. వీటి నిర్వహణ పట్టణంలోని ప్రముఖ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరుగుతుంది.

హరితహారంలో జమ్మి మొక్కలను లభించని స్థానం

గడిచిన పదేళ్ల కాలంలో తెలంగాణలో కోట్ల మొక్కలు నాటారు. తెలంగాణ స్వరాష్ట్రంలో పండుగలకు అత్యంత ప్రాధాన్యం ఉంది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా నాటి ప్రభుత్వం నాలుగు చిహ్నాలను ప్రకటించింది. అందులో ఈ దసరా పండుగలో ప్రాధాన్యం కలిగిన తంగేడు పువ్వు, పాలపిట్ట, జమ్మి చెట్టు ఉన్నాయి. కానీ అలాంటి జమ్మి చెట్టు, తంగేడు పువ్వు వృద్ధి కోసం ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు ఉన్నాయి. బతుకమ్మ పండుగకు ఒక్కోసారి తంగేడు పూలు లభించటం కష్టంగా ఉంటోంది. ఇక జమ్మి చెట్టు ఉన్న ఊరు కూడా అరుదుగా మారింది. జమ్మి చెట్టు కొమ్మలను తెచ్చి పూజలు జరుపుకునే స్థాయికి వచ్చింది.

విస్మరించిన సింగరేణి..

ఇల్లెందులో సింగరేణి సంస్థకు అత్యధికంగా మైదానాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యంగా జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో దసరా ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ గ్రౌండ్‌లో కనీసం ఒకటి రెండు జమ్మి మొక్కలు నాటితే ఉత్సవాల సందర్భంగా పూజలకు ఉపయోగపడే అవకాశం ఉంది. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న జమ్మి మొక్కను నాటేందుకు సింగరేణి సంస్థ కూడా విస్మరించింది. ఇటీవల సింగరేణి ఏరియా జీఎం జాన్ ఆనంద్ జమ్మి మొక్క ఏర్పాటు ఆవశ్యకతను గుర్తించారు. జమ్మి మొక్కలు తెప్పించి నాటుతామంటూ హామీ కూడా ఇచ్చారు.

బావుల మీద కానరాని ఉత్సవాలు..

బొగ్గు బావులకు నిలయమైన ఇల్లెందులో మైన్‌ల మీద వైభవంగా దసరా ఉత్సవాలు జరిగేవి. ఉద్యోగులు, కార్మికులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి జంతు బలి ఇచ్చి, అక్కడే వంటావార్పు మందు, విందు భోజనాలు చేసేవారు. శ్రుతిమించిన ఉత్సవాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయంటూ ఉత్సవాలకు కంపెనీ చరమగీతం పాడింది.

ఉత్సవాలలో ఎవరుంటే వారిదే హవా..

ఏటా వినాయకచవితి, దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది పండుగలు తెలుగు వారికి అత్యంత ప్రాముఖ్యత కలిగిన పండుగలు. అయితే ఈ పండుగల నిర్వహణ ఎవరు ఉంటే వారిదే హవా అన్నట్లు మారింది. పాలకవర్గాలు తమ కనుసన్నల్లో నిర్వహిస్తున్నాయి. భక్తులు, ప్రముఖులు, పెద్దలతో కూడిన కమిటీలు నామమాత్రంగా ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కులాలు, వర్గాలకు అతీతంగా ఈ పండుగలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించుకోవాలి. కానీ ఆటాపాటలకు ప్రాధాన్యం ఇచ్చి సంస్కృతి, సంప్రదాయాలకు తగ్గిస్తున్నారు. శమీపూజ పాలపిట్ట దర్శనం, అపరాజిత దేవీ దర్శనం లేకుండా పోయింది.

జమ్మి మొక్కలు నాటుతాం..



సింగరేణి గ్రౌండ్‌లతో పాటు మైన్‌ల ప్రదేశాలలో జమ్మి మొక్కలను నాటేందుకు కృషి చేస్తాం. ముందే తెలిసి ఉంటే .. వర్షాకాలంలో మొక్కలు తెచ్చి నాటేవారము. ఇప్పుడు తప్పకుండా తెప్పించి కొన్ని మొక్కలు నాటి రక్షించే ప్రయత్నం చేస్తాం, ముఖ్యంగా సింగరేణి గ్రౌండ్‌లలో నాటుతాము.

– జాన్ ఆనంద్, జీఎం, సింగరేణి ఇల్లెందు ఏరియా

మొక్కలు తెప్పిస్తాం..



ఎన్నో ఏళ్లుగా ఇల్లెందులో జమ్మి వృక్షం లేకుండా జమ్మి పూజ జరుగుతోంది. ఇక మీదట కొన్ని మొక్కలు తెప్పించి జమ్మి మొక్కలు నాటించి రక్షించే యత్నం చేస్తాం. హరితహారంలో జమ్మి మొక్కలు, తంగేడు మొక్కలు నాటితే అటు పూలు ఇటు పూజలకు ఉపయోగంగా ఉంటుంది.

– డీవీ, మున్సిపాలిటీ చైర్మన్, ఇల్లెందు

పీడీఎస్‌యూ విద్యార్థుల పక్షం..



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): 21న జరగనున్న పీడీఎస్‌యూ 50 వసంతాల సభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి ఇరప రాజేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం కొత్తగూడెంలోని ప్రకృతి ఆశ్రమంలో పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. 50 ఏళ్ల విప్లవ ప్రస్థానంలో పీడీఎస్‌యూ విద్యార్థుల పక్షాన నిలబడి హక్కుల కోసం పోరాడిందన్నారు. 21వ తేదీన ఖమ్మం, 24న హైదరాబాద్‌లో జరగనున్న పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవ సభలకు విద్యార్థులు, పీడీఎస్‌యూ నాయకులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ప్రణయ్ కుమార్, సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా మొదటి అధ్యక్షుడు బత్తుల రాఘవరావు, రెండో అధ్యక్షుడు టి.సత్యానారాయణ, సాంబశివరావు, పురుషోత్తం, సైమన్, వెంకటేశ్వరరావు, జే.సీతారామయ్య, ఎస్.ఉపేందర్‌రావు, సుగుణరావు, కృష్ణయ్య, ఏ.రాంబాబు, ఈశ్వర్, గౌని నాగేశ్వరరావు, మోకాళ్ల రమేష్, సైదుబాబు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

రైతుకూలీ సంఘం కార్యవర్గం ఎన్నిక



రామ్మూర్తి, రామస్వామి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామంలో ఆదివారం అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కౌన్సిల్‌లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఉప్పరబోయిన రామ్మూర్తి, ఉపాధ్యక్షుడిగా పెనక రామస్వామి, ప్రధాన కార్యదర్శిగా కొమరం సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా పూనెం సమ్మయ్య, కోశాధికారిగా సనప కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా బుచ్చిరాజు, మంచినీళ్ల భాస్కర్, సుగుణ, ఉమ, సోడి జోగయ్య, 12, 13 కోఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు.

మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించండి..

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. మున్సిపాలిటీకి ఎన్నికలు జరపకుండా కార్పొరేషన్ చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతీ ఎన్నికల్లో నాయకులు ఎన్నికలు జరిగేలా చూస్తామంటూ హామీ ఇచ్చి విస్మరించడం పరిపాటిగా మారిందన్నారు. సమావేశంలో గంధం మల్లికార్జునరావు, కె.ప్రవీణ్ కుమార్, గుగులోతు వెంకటేష్, శ్రీను, వాసు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కామేష్

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

సుజాతనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని సీపీఎం జాతీయ కమిటీ సభ్యుడు బి.వెంకట్ పిలుపునిచ్చారు. సీతంపేట గ్రామశాఖ మహాసభ ఆదివారం చిలుక వెంకట్రామయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకట్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ పాలనలో దేశం 50 ఏళ్ల పాటు వెనక్కి వెళ్లిందన్నారు.

ప్రధాని మోదీ అవలంబిస్తున్న ప్రైవేటీకరణ విధానాల వలన ప్రభుత్వ రంగ సంస్థలు బీఎస్ఎన్ఎల్, పోస్టల్, రైల్వే, విమానాయన సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వలన అనేక మందికి ఉద్యోగ, ఉపాధి లేకుండా పోయిందని ఆరోపించారు. అన్నం పెట్టే రైతును కాలగర్భంలో కలపాలని నల్లచట్టాలని తీసుకొస్తే ఢిల్లీలో రైతాంగం చేసిన ఆందోళన ఫలితంగా మోదీ ప్రభుత్వం దిగివచ్చి ఆ చట్టాలను రద్దు చేసిందన్నారు. జమిలీ ఎన్నికలను తీసుకొచ్చి రాష్ట్రాల హక్కులను కాలరాయాలని చూస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తామని, సక్రమంగా అమలు చేయలేదని ఇంతవరకు రైతుబంధు, కౌలురైతులకు రూ.12వేలు ఇస్తామని నేటికీ అమలు చేయకపోగా హైడ్రా పేరుతో ప్రజలను పక్కదొవ పట్టిస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటమే సీతారాం ఏచూరికి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, ధర్మ, మండల కార్యదర్శి వీర్ల రమేష్, తిరుపతిరావు, శంకర్ భాను, భాస్కర్, సత్యం, వెంకటనారాయణ, శారద, రంగయ్య పాల్గొన్నారు.

ప్రపంచ మానవాళికి దిక్సూచి మార్క్సిజం



మాట్లాడుతున్న సోమయ్య

ఇల్లెందు: సీపీఎం నూతన శాఖ కార్యదర్శులకు ఆదివారం ఇల్లెందులో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.సోమయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రపంచ మానవాళికి దిక్సూచి మార్క్సిజం అన్నారు. నేడు ప్రపంచ దేశాల్లో కమ్యూనిస్టు పార్టీకి అనుకూల వాతావరణం ఏర్పడుతోందన్నారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. శాఖ కార్యదర్శులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. నబీ, ఆలేటి కిరణ్, మోహన్‌రావు, జైరున్నిసా, సర్వన్, ఖాదర్, సంధ్య, సుల్తానా, మాదారపు వెంకటేశ్వర్లు, వాసం రాము, మరియా, వెంకటమ్మ, తాళ్లూరి పద్మ, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలి

పాల్వంచ: హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే.రమేష్ అన్నారు. ఆదివారం స్థానిక అల్లూరి సెంటర్ మంచికంటి భవన్‌లో హమాలీ వృత్తి శాఖ సమావేశం నిర్వహించారు.

మాట్లాడుతూ.. హమాలీ కార్మికులు దేశ నిర్మాణంలో కీలకంగా ఉన్నారని, ప్రభుత్వాలు, యజమానులు, వారిని మూటలు మోసే వారిగా భావిస్తున్నారన్నారు. వారికి పీఎఫ్, ఇతర సౌకర్యాలు ఏవీ లేవన్నారు. 60 సంవత్సరాలు నిండిన హమాలీల అందరికీ రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. దొడ్డా రవికుమార్, కె.సత్య, పి.తులసీరాం, ఎ.రాములు, పి.గటయ్య, ఈర్ల గట్టయ్య, సంతోష్, సదానందం, మల్లయ్య, సురేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్

డాక్టర్ లేని జేకే డిస్పెన్సరీ

- రోగుల అవస్థలు
- జీఎం సందర్శించినా మార్పు లేదు

ఇల్లెందు: పట్టణంలోని జేకే కాలనీలో సింగరేణీయుల వైద్యం కోసం ఏర్పాటు చేసిన డిస్పెన్సరీలో వైద్యులు లేరు. కేవలం నర్సు, సిబ్బందితో డిస్పెన్సరీ సాగుతోంది. ఒకనాడు వందల సంఖ్యలో వచ్చే రోగులు ప్రస్తుతం 20 నుంచి 50 మందే వస్తున్నారు. వీరందరికీ నర్సు, సిబ్బంది ఆరోగ్య పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. ఏ జబ్బుకు ఏ మందు ఇవ్వాలని మాత్రం పరీక్షించేందుకు డాక్టర్ లేడు. ఇటీవల సింగరేణి ఏరియా జీఎం జాన్ ఆనంద్ డిస్పెన్సరీని సందర్శించి పరిశీలించారు. మూడు నెలలుగా డాక్టర్ పోస్టు ఖాళీగా ఉందని ఆయన దృష్టికి రాగా వెంటనే డాక్టర్ పోస్టును భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే వారం రోజులు అయినా డాక్టర్ రాకపోవటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. మొయిన్ ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించుకుని మందుల కోసం ఇక్కడికి వచ్చేలా ఈ డిస్పెన్సరీ మారిపోయింది. డిస్పెన్సరీ ఉన్న చోటనే ఐఎన్టీయూసీ నేతలు, ఎమ్మెల్యే కోరం కనకయ్య క్యాంపు కార్యాలయం ఉంది. ఇదిలా ఉండగా ఇల్లెందులో సింగరేణి ఆధ్వర్యంలోని మొయిన్ ఆస్పత్రిలో కూడా నలుగురు వైద్యులు ఉన్నారు. ఒకరిని ఈ డిస్పెన్సరీకి డిప్యూటేషన్ మీద తాత్కాలిక సేవల కోసం వినియోగించే అవకాశం ఉంది. అయినా ఎవరూ పట్టించుకోవటం లేదని తక్షణమే డాక్టర్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.



ఇల్లెందు డిస్పెన్సరీ

ఘనంగా బతుకమ్మ సంబురాలు



ఇల్లెందు: బతుకమ్మల వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, సతీమణి లక్ష్మి

ఇల్లెందు: తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పూల పండుగ బతుకమ్మ అని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయం వద్ద బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. తన సతీమణి లక్ష్మితో కలిసి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. కార్యాలయం ఆవరణలో బతుకమ్మ ఆట కోసం లైటింగ్, సౌండ్ సిస్టమ్, కార్పెట్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మ ఆట ఒక భాగమైందన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, తెలంగాణ నిండుతనం పరిఢవిల్లాలని ఆకాంక్షించారు.

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో ఆదివారం ఐదో రోజు అట్ల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. బస్టాండ్ సెంటర్‌లో మహిళల కోలాటం ఆకట్టుకుంది. రామాలయం వద్ద ఆట పాటలతో మహిళలు, యువతులు బతుకమ్మ ఆడారు.

జూలూరుపాడు: గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఐదో రోజు తీరొక్క పూలతో పేర్చిన అట్ల బతుకమ్మలకు మహిళలు, యువతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడి పాడారు. ఆ తరువాత బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు.



టేకులపల్లి: బస్టాండ్ సెంటర్‌లో కోలాటమాడుతున్న మహిళలు



జూలూరుపాడు: వెంగన్నపాలెం టీచర్స్‌కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు



జూలూరుపాడు న్యూకాలనీలో బతుకమ్మలతో మహిళలు

లలితా త్రిపుర సుందరి అవతారంలో...



ఇల్లెందులో...

శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు మండపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి మాల ధరించిన భక్తులు దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్‌లో దుర్గమ్మకు పూజ చేస్తున్న భవానీ మాలధారులు



జూలూరుపాడు: వెంగన్నపాలెం టీచర్స్ కాలనీలో శ్రీ లలితా త్రిపుర సుందరిగా అమ్మవారు



కొత్తగూడెంటౌన్: మార్వాడీ క్యాంప్‌లో..



సుజాతనగర్: పూజలు నిర్వహిస్తున్న భక్తులు



టేకులపల్లి: రామాలయం ఆవరణలో..



జూలూరుపాడు: పాపకొల్లు ఉమాసోమలింగేశ్వర ఆలయంలో...



కొత్తగూడెంటౌన్: గణేష్ టెంపుల్‌లో...



జూలూరుపాడులో అమ్మవారికి ప్రత్యేక పూజలు